క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపిక య్యారు. ఇటీవల 54వ సీనియర్ మహిళల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. వేమనపల్లి మండలానికి చెందిన పాల్క అనూష, బెజ్జూర్ మండలానికి చెందిన జ్యోతి, మంచిర్యాలకు చెందిన శృతి, కాగజ్‌నగర్‌కు చెందిన ఊర్వశి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి జూలై 2వరకు గుజరాత్‌లోని భుజ్‌లో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. విద్యార్థినులను కోచ్ సునార్కర్ అరవింద్, అసోసియేషన్ కోశాధికారి ఏ.రమేశ్‌రెడ్డి, రాకేశ్, సాయి, గురువేందర్ అభినందించారు.

నేడు 'పీఎం జుగా'పై అవగాహన

లింగాపూర్: మండల కేంద్రంలో శనివారం పీఎం జుగా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీవో రజినీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రానికి చెందిన ప్రజలు పాల్గొనాలని కోరా రు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దండోరా జెండా ఎగురవేయాలి

దహెగాం: ఎన్నో ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. జులై 7న గ్రామాల్లో దండోరా జెండా ఎగురవేయాలన్నారు. జెండా ఎగురవేసేందుకు మండల కమిటీలను నియమిస్తున్నామన్నారు. మండల ఇన్‌చార్జిగా మహేశ్, కో ఇన్‌చార్జిగా ఆయిల్ల శంకర్‌లను నియమించారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, బుచ్చయ్య, శేఖర్, సాయికిరణ్, భూమయ్య పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బెజ్జూర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆదివాసీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాన్య గిరిజన రైతు కుటుంబంలో పుట్టి భారత రాష్ట్రపతిగా ఎదిగిన తొలి ఆదివాసీ మహిళగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మెడి సతీష్, తోర్రెం వినోద్, పోర్సెట్టి నగేశ్, అత్రం అరుణ్, పోల్క వెంకటేశ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'

జైనూర్: నిరుపేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్టీ చైర్మన్ ఆనంద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జైనూర్ మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. మండల ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రకాశ్, నాయకులు అజ్జులాలా, సుద్దాల శ్రీనివాస్, దండుగుల మహేశ్, కుంరం కోటేశ్వరరావులున్నారు.

నేడు యోగా దినోత్సవం

కాగజ్‌నగర్ టౌన్: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారత్ స్వాభిమాన్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పటేల్‌గార్డెన్‌లో శనివారం నిర్వహించనున్నట్లు శుక్రవారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జిల్లా యోగా ప్రచారకుడు దాసరి వినోద్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. యోగా దినోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిర్యాణి: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా కుటుంబ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్‌బీఐ ఏజీఎం సభవత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు బ్యాంకు రుణాలతో పాటు ఇతర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వృథా ఖర్చును తగ్గిస్తూ పొదుపుపై దృష్టి సారించాలని సూచించారు. నాబార్డు డీడీఎం వీరభద్రుడు, టీజీబీ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై యూటీఎఫ్ హర్షం

ఆసిఫాబాద్‌రూరల్: డీఎస్సీ–2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు అక్టోబర్ 10 నుంచి సర్వీస్ పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఓ ప్రకటనలో హర్షం హర్షం వ్యక్తంజేశారు. ఉపాధ్యాయుల ఎంపిక నాటి నుంచి వారి సర్వీస్ లెక్కింపు కోసం తాము చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు.

బొమ్మల బడి

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్య పాఠశాల గదులు, ప్రహరీపై వివిధ రకాల రంగురంగుల బొమ్మలు వేయించారు. స్వాతంత్య్ర సరమయోధులు, సేవ్ వాటర్, నక్షత్రాలు తదితర అంశాల గురించి వేసిన బొమ్మలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాఠశాలలో 120 మంది విద్యార్థులుండగా ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. ఐదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలోనూ విద్యాబోధన కొనసాగుతోంది. – కెరమెరి



సావర్‌ఖెడాలోని పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాల


గోడలపై వేసిన చిత్రాలు

నాణ్యతకు పాతర..!

దహెగాం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏడాది కాక ముందే పగుళ్లు తేలింది. పైన పటారం.. లోన లొటారం అన్న తీరుగా ఉంది ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం. రూ. 1.56 కోట్లతో నాణ్యత పాటించకుండా నిర్మించారు. ప్రసూతి గది గోడకు అమర్చిన టైల్స్ ఊడి పడుతున్నాయని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


గోడకు పగుళ్లు తేలిన టైల్స్


ప్రసూతి గదిలో బాత్రూం వద్ద కుంగిన టైల్స్

గిరిజనుల సమగ్రాభివృద్ధికి 'పీఎం జుగా'

తిర్యాణి: గిరిజనుల సమగ్రాభివృద్ధికి తీసుకువచ్చిన పీఎం జుగా పథకాన్ని గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ సూచించారు. శుక్రవారం మండలంలోని తలండి గ్రామంలో పీఎం జుగా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం జుగా పథకం ద్వారా గిరిజనులకు దాదాపు 90 శాతం సబ్సిడీతో జీవనోపాధి కోసం మేకలు, గొర్రెలు, కోళ్ల యూనిట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్, ఆధార్ కార్డులు కలిగి ఉండాలని సూచించారు. ఎస్ఆర్పీ వెద్మ యశ్వంత్‌రావు తదితరులున్నారు.


పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మల్లేశ్

ఆటోమేటిక్ శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్ వితరణ

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల కోసం శుక్రవారం ఇండస్ టవర్ ఆర్థిక సహాయంతో న్యూఢిల్లీకి చెందిన పింకిష్ ఫౌండేషన్ సంస్థ శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్ అందించడం సంతోషకరమన్నారు. ఫౌండేషన్ సంవత్సర కాలం పాటు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నీరంజన, పరమేశ్వర్, ఉపాధ్యాయులు పావని, ప్రతిత పాల్గొన్నారు.


మిషన్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

కౌటాల: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ అధికారి ధముక ప్రభుదాస్ అన్నారు. కౌటాల, రవీంద్రనగర్, ముత్తంపేట టీజీబీ బ్యాంకుల ఆధ్వర్యంలో మహిళ సంఘాలకు రూ. 5 కోట్ల రుణాల మంజూరు చెక్కును శుక్రవారం కౌటాల రైతు వేదికలో అందజేశారు. బ్యాంకులు అందించే రుణాలతో స్వయం ఉపాధి పొందాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించి మళ్లీ రుణాలు తీసుకోవాలన్నారు. అనంతరం బాధితుడు చౌదరి ఓంకార్‌కు రూ. 10 లక్షల బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, డీపీఎం అన్నాజీ, ఏపీఎం ముక్తేశ్వర్, దేవానందం, ఎంఎస్ అధ్యక్షుడు కుసుమ, మేనేజర్లు రమేశ్, కిరణ్, రాజ్‌కుమార్, ప్రేమానందం, ప్రసన్న, నాగరాజు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న అధికారులు

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కౌటాల: మండలంలోని కన్నెపల్లి హనుమాన్ ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమోద్ కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ఒక వ్యక్తి కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. హనుమాన్ ఆలయ స్థలం తనదేనని ఆలయ స్థలానికి చుట్టూ పెన్షన్ పోల్స్ వేశారని పేర్కొన్నారు. ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మోర్లె పాండురంగ్, శ్రీరాముల శంకర్, సంతోష్, పెంటూ, ముండి, గంగారాం, నాందేవ్, బాపురావ్ పాల్గొన్నారు.

ఘనంగా బుచ్చిలింగం వర్ధంతి


నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గుల్లపల్లి బుచ్చిలింగం 6వ వర్ధంతిని పద్మశాలి భవనంలో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బుచ్చిలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, సిందం చంద్రయ్య, రాపెల్లి సదానందం, గుల్లపల్లి నాగేశ్వర్‌రావు, ఆనంద్, కొంగ సత్యనారాయణ, వొడ్నాల వెంకన్న,సిదం శ్రీనివాస్, మామిడాల రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ మధూకర్, రెవెన్యూ సిబ్బంది అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

శాశ్వత పరిష్కారానికే భూ భారతి..

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తొలగించి భూభారతి తీసుకువచ్చిందన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని 35 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను రెండు బృందాలుగా ఏర్పాటు చేసి రైతుల నుంచి 327 దరఖాస్తులు స్వీకరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కాగజ్‌నగర్ రూరల్: ఆయిల్‌పాం సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కాగజ్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి సుప్రజ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో రైతు రామ్మోహన్ తన 5 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పాం సాగును పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. యూరియా, ఎరువులను తగిన మోతాదులో వేయాలని, గెలలు ఎక్కువగా వచ్చేందుకు బోరాన్ మెగ్నీషియంతో కూడిన మందులను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి రమేశ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

రెబ్బెన: మండలంలోని రాళ్లపేట శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన ఘనపురం కృష్ణమూర్తి (55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిరాణా షాపు పెట్టుకుని జీవిస్తున్న కృష్ణమూర్తి ఈనెల 18న పని నిమిత్తం ఎల్లూర్ నుంచి ఆసిఫాబాద్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరగా మార్గమధ్యలోని రెబ్బెన మండలం రాళ్లపేట శివారులో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కృష్ణమూర్తి ముఖం భాగం, పక్కటెముకలు, ఎడమ చేయి, కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కృష్ణమూర్తిని కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయానికి దారేది?

- ఒకపక్క అడవి.. మరోపక్క పొలాలు
- మధ్యలో ఎల్లారం పోచమ్మ గుడి
- ఏటా పెరుగుతున్న భక్తుల తాకిడి
- కనీస సౌకర్యాలు కరువు


ఎల్లారం పోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు


దర్శనం కోసం బారులుతీరిన భక్తులు (ఫైల్)

బెజ్జూర్: ఎల్లారం పోచమ్మ ఆలయం.. ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మికతకు నిలయం. రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతున్నప్పటికీ రహదారి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు లేక భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. పచ్చని పొలాలు, అడవి మధ్య ఉన్న దేవస్థానానికి వెళ్లాలంటే బురద రోడ్డు దాటాల్సిందే. వర్షం పడితే కనీసం కాలినడక వెళ్లడం కష్టంగా మారుతోంది. అభివృద్ధి దిశగా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రయత్నం లేకపోవడం భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

బెజ్జూర్ నుంచి 3 కి.మీ దూరంలో..

బెజ్జూర్ మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో ఉన్న ఎల్లారం పోచమ్మ ఆలయంలో ఏటా భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రతీరోజు పదుల సంఖ్యలో భక్తులు దర్శనానికి వెళ్తుంటారు. గురు, ఆదివారాల్లో వందల సంఖ్యలో ఆలయంలో పూజల్లో పాల్గొంటారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా ఆలయానికి భక్తుల తాకిడి అత్యధికంగా పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు. దీంతో సరైన రోడ్డు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలు కురిస్తే ద్విచక్ర వాహనం, ఎడ్లబండి సైతం వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని భక్తులు కోరుతున్నారు.

అందమైన ప్రాంతం..

ఆలయం ఒకపక్క పచ్చని పొలాలు.. మరోపక్క పచ్చని అడవి ఉండడమే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే పేరుగాంచిన ఆయకట్టు స్ప్రింగ్ ఆనకట్ట నుంచి వర్షాకాలం, ఎండాకాలం ఎప్పటికి నీరు వచ్చి ఆ ఎల్లారం పోచమ్మ ఆలయం ముందు నుంచి వెళ్తూ ఉంటుంది. వేసవి, వర్షాకాలం అనే తేడా లేకుండా భక్తులు తమ కోరికలు తీర్చుకునేందుకు తండోప తండాలుగా తరలివస్తుంటారు.

బీటీరోడ్డు వేయాలి



ఎల్లారం పోచమ్మ ఆలయం వరకు మట్టిరోడ్డు కావడంతో ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. ఆలయానికి వెళ్లాలంటే వర్షాకాలం నానా అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– కావుడే శ్యామ్‌రావు, చిన్నసిద్దాపూర్

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



ఆలయం వద్ద విద్యుత్ సౌకర్యం లేక భక్తులకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కరెంటు సౌకర్యంతో పాటు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలి. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రతీ సంవత్సరం శ్రమదానంతో బాగు చేసుకుంటున్నాం.

– బొగ్గుల తిరుపతి, పెద్ద సిద్దాపూర్

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ టౌన్: పట్టణానికి చెందిన ఐతం రాజయ్య చికిత్స కోసం మంజూరైన రూ.2.30 లక్షల ఎల్‌వోసీ లేటర్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ శుక్రవారం బాధితుడి కుమారుడు ఉదయ్‌కు అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌వోసీని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

నూతన టెండర్ ప్రకటించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ పురపాలక సంఘం అధీనంలోని వాణిజ్య సముదాయాలకు నూతనంగా టెండర్ ప్రకటించాలని శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో లోకేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ గ్రామపంచాయతీగా ఉన్నపుడు ఆర్థిక రాబడి నిమిత్తం వివేకానంద చౌక్‌లో 1995లో వాణిజ్య దుకాణా సముదాయం నిర్మించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో తిరిగి నూతన టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. దీంతో వాణిజ్య దుకాణా సముదాయాల ద్వారా యువతకు స్వయం ఉపాధితో ఉపాధి అవకాశాలు అందుతాయని తెలిపారు.

పేదల కల నెరవేర్చడమే లక్ష్యం

రెబ్బెన: పేదల కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీఏ మెంబర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ పెసరి మధునయ్య, హౌసింగ్ ఏఈ సుభాష్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు సోనాలే సంతోష్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న రమేశ్

మానవాళికి చెట్లే జీవనాధారం

జైనూర్: మానవ మనుగడకు చెట్లు ఎంతో ఉపయోగకరమని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పోచంలొద్ది కేజీబీవీలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడంలో పచ్చదనం ప్రాముఖ్యత ఎంతో ఉంటుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి చెట్లు నాటాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కేజీబీవీలో నాటిన మొక్కలను పరిరక్షించుకోవాలని సూచించారు. ఏపీవో నగేశ్, సాంకేతిక సహాయకుడు సురేందర్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అబ్దుల్ ముఖిద్, నాయకుడు గేడం గోపీచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కేజీబీవీలో మొక్కలు నాటుతున్న విశ్వనాథ్

ఆక్రమణలు తొలగించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రధాన నాలాపై ఆక్రమణలు తొలగించాలని శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు కాలనీవాసులు వినతిపత్రం అందించారు. వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ద్వారకానగర్, సంజీవయ్య కాలనీ, శ్రీకృష్ణనగర్ తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్ కాలనీలోని దోబీఘాట్ సమీపంలో నాలాను పూర్తిగా ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను ఎస్సై ప్రశాంత్ శుక్రవారం బాధితుడికి అప్పగించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఇటీవల వాంకిడి మండలంలోని ఖమాన గ్రామ శివారులో సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే ఫిర్యాదు చేస్తే తిరిగి పొందే అవకాశముందని ఎస్సై తెలిపారు. కానిస్టేబుల్ నయీమ్ పాల్గొన్నారు.